# రేణక్క

-శ్రీనివాసరాజు

హోరుగాలి. జోరువర్షం. చిక్కటి చీకటి. ఉన్నవాడికి స్వర్గంగానూ, లేనివాడికి నరకంగానూ తోచే పరిస్థితి. పురుటి నొప్పులతో తల్లడిల్లిపోతోన్న సత్తెమ్మని డాక్టరింటికి తీసుకొచ్చేసరికి ఏ అర్ధరాత్రో అవుతోంది.

"డాక్టరమ్మా, డాక్టరమ్మా" ఆందోళనంతో తలుపుల మీద దబదబమంటూ శబ్దం రూపంలో. ఆ ఇంటి తలుపులకి ఇవన్నీ చాల సుపరిచితమే. వెంటనే తెరుచుకొన్న తలుపులు. ఆ వెనుకనే ఏమాత్రం విసుగూ, అలుపూ తెలీని ప్రశాంత వదనంతో డాక్టరమ్మ.

"మా బిడ్డని నువ్వే కాపాడాలమ్మా" అంటూ మోకరిల్లిన సత్తెమ్మ తల్లిదండ్రుల్ని, బంధువుల్ని వారిస్తూ, ధైర్యం చెబుతూ "లోపల తీసుకురండి" అంటూ వడివడిగా కర్తవ్యోన్ముఖంగ నడిచిందావిడ.

మూసుకొన్న గది తలుపులు. తెరుచుకున్న మది కవాటాలు. సత్తెమ్మ కన్నోళ్ళు, అయినోళ్ళ మనసుల్లో మెదిలో ఆలోచనా తరంగాలు.

"ఎన్ని వందల మందికి, వేల మందికి ఈయమ్మ ఏ టైములో పిలిస్తే ఆ టైములో దేవతలా పెత్తెచ్చమై పురుళ్ళు పోస్తాంది. ఆస్పత్రిలో సూస్తే పొద్దునొచ్చి కూసుంటే మధ్యాన్నం అన్నానికి కూడా లేవకుంటా పేసంట్లందర్నీ సూసిగానీ కదల్దు తల్లి. ఆదివారం లేదు, సోమవారం లేదు, ఒక టైమూ లేదు. ఎప్పుడెవురు ఆస్పత్రికొచ్చినా, ఇంటికొచ్చినా సూస్తానే వుండే.

వచ్చినోళ్ళ దగ్గర పైసలుండాయా, లేవా అనేదేం వుండదు. ఆళ్ళ జేబులు సూడదు తల్లి, ఒళ్ళు సూస్తది. వాళ్ళు ఏమిస్తే అదే పీజు. అసలు పీజన్న మాట పట్టించుకోదాయ, ఆళ్ళకాడ ఏమీలేదంటే మందుల కరుసులకి డబ్బులు కూడా ఎదురిచ్చి పంపిస్తా వుండె. మా యమ్మ పదికాలాలు సల్లంగుండాల.

> **బొమ్మ**
>
> నాటి 'బాపూ' బొమ్మ
> లేలేత కొమ్మ
> నేటి బాపూ బొమ్మ
> వయసు తొడిగిన జాబిలమ్మ
>
> -కె.వి. సుబ్బారావు

ఈ రోజుల్లో ఎవుర్రా ఈయిదంగా మడుసుల్ని మడుసులుగా సూసేది? వూరికే మాటొరసకి మడిసికి సేసే సేవే భగమంతుడికి సేసే సేవ అనడం కాదురా. ఈ యమ్మని సూసి తెలుసుకోవాల ఎవుడయినా. వూరికే అనుకోడం కాదుగానీ, ఆ కుటుంబానికి సరయిన కోడలు ఆ యమ్మ. ఆళ్ళ మామగారు ఎటువంటి మడిసి. డాక్టర్ చెలికాని రామారావు గారంటే ఆ సుట్టుపక్కల ఊళ్ళలో ఎంత పేరు! డబ్బుదేవుందిరా, పాపిష్ఠిది. ఈ రోజుంటది, రేపోద్ది. కానీ ఆ అయ్యని, ఆయన పోయి పాతికేళ్ళు కావొస్తున్నా, ఈ రోజుకీ తలుసుకుంటా వుండారంటే ఆయన పెజలకీ, పేదోళ్ళకీ సేసిన సేవే.

ఆయన ఆయన కోసం బతకలా, ఆయన జీవితం ఆయనది కాదు, పెజలది. అదీ లెక్క సదువుకుంటూనే సొతంతరం కోసం జైలుకి పాయె, అక్కడేదో వూసలు లెక్కెట్టుకుంటూ కూసోలా. అక్కడా తోటి కయిదీలకి పాఠాలూ, సేవలూ. ఒళ్ళంతా దేశభక్తి నింపుకొన్న మడిసి. ఇటువంటి మహానుభావుల త్యాగాలతో, కష్టాలతో వచ్చిన సొతంతరం, పెజాస్వామ్యం ఇప్పుడు రాజకీయాలు సూసి సొమ్మసిల్లి పోతున్నట్టుండె.

ఆయనా డాక్టర్‌గా అంతే. మనసున్న మారాజు. పేదోళ్ళ పెన్నిధి. ఆ ఇంటి అడ్రస్ తెలియని వాళ్ళుండరు. వైద్యం చేయడమే ఆయన పని. ఫీజుతో పన్లేదు. వైద్యం చేసాక, మందుల అవీ ఇచ్చి, కావలసిన మందులు ఆయన దగ్గర లేకపోతే బయట మందుల షాపులో ఈయన ఖాతాలో కొనుక్కోమని చీటీ రాసిచ్చి, ఆప్యాయంగా "ఇంటికెళ్ళి భోజనం చేసెళ్ళమని చెప్పి, దారి ఖర్చులకి డబ్బులిచ్చి.. ప్రేమగా పేషంట్లని సాగనంపడం... ఎప్పుడూ ఓ నలుగురు పేద విద్యార్థుల్ని చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించి జీవితంలో వాళ్ళకో దారి చూపించడం...

మహాత్మా గాంధీ లాంటి మనిషి ఈ భూమ్మీద సంచరించాడా? అంటూ ఆశ్చర్యపోతుంది మానవాళి ఓ రోజు అంటూ ఐన్‌స్టీన్ చెప్పింది గుర్తొస్తోంది కదూ, డాక్టర్ చెలికాని రామారావు గారి గురించి చెబుతుంటే... నిజమే డా॥ చెలికాని రామారావు గారి జీవితమూ అంతే. ఆయన డాక్టరే కాదు, మూఢనమ్మకాల్ని

ఎదిరించి బ్రతికిన సంఘ సంస్కర్త. సాహసి. చెప్పడం కాదు, చేసి చూపించిన ఆదర్శవాది. ఇంతెందుకండీ బాబూ, మానవత్వం మూర్తీభవించిన ఓ గొప్ప మడిసని సెప్పండి.

అటువంటోరి కోడలండీ ఈ డాట్టరమ్మ. డాట్టరమ్మ అత్తగారూ తక్కువ వారేం కాదు. డాక్టర్ కమలమ్మ. ఆమే అంతే... దేవత. డాక్టర్ చెలికాని రామారావు గారి అడుగుజాడల్లో, పురోగతి పథంలో నడిచిన సహ ధర్మచారిణి. కందుకూరి వీరేశలింగం గారి పెంపకంలో పెరిగిన అభ్యుదయవాది.

పులి కడుపున పిల్లి పుట్టదు కదా. అలాగే వాళ్ళబ్బాయ్ డాక్టర్ స్టాలిన్. అదేనండీ మన కథా నాయకురాలు డాట్టరమ్మ గారి డాట్టరండీ. ఆళ్ళ అమ్మ నాన్నల గుణాలన్నీ వుంటాయ్ ఆయన్లో. ఈయనా ఇంతే... పేదోళ్ళ డాక్టరు. చెట్టంత మడిసి. పసిపిల్లోడి మనసు. దేనికయినా హాయిగా నవ్వేస్తాడు. ఏ విషయమయినా బాగా ఆలోచిస్తాడు. విశ్లేషణాత్మకంగా విషయాన్ని విడమరచి చెప్పగల అనలిటికల్ థింకర్. యథార్థవాది. స్నేహమంటే ప్రాణమిచ్చేస్తాడు. ప్రేమలో పడినోడయినా ఎలాగోలా బయట పడగలరేమో కానీ, ఆయన స్నేహంలో పడినోళ్ళు మాత్రం బయటపడ లేరు. అటువంటి డాక్టర్ భార్య మన డాక్టరమ్మ, డా॥ రేణుకాదేవి. ఎంతమంది స్నేహితులు! ఎప్పుడూ వచ్చేపోయేవాళ్ళతో కళకళలాడుతుంటుంది ఆ ఇల్లు.

చిన్నా పెద్దా అంతా ఆయమ్మని ఆప్యాయంగా పిల్చుకొనే పేరు 'రేణక్క'. ఇంట్లో రేణక్క రేణక్కే. డాక్టర్‌లా వుండరు.

పులి కడుపున పుట్టిన పులికి పిల్లి పుట్టదు కదా. అలాగే స్టాలిన్‌బాబుకి, రేణక్కకి ఓ అమ్మాయ్. అమ్మాయ్ డాక్టర్ కవిత పెళ్ళయి– భర్త డాక్టర్ విజయ్ మోహన్, పిల్లలు రన్విత, తన్‌హస్‌లతో హైదరాబాద్‌లో సుఖంగా వుంటోంది. అబ్బాయ్ డాక్టర్ చెలికాని రామారావు (తాతయ్య గారు మళ్ళీ). వీడూ అంతే. కుటుంబ వారసత్వమైన ప్రేమ, స్నేహం, ఆప్యాయతల్ని పుణికి పుచ్చుకొన్న ఎముకల డాక్టర్. కోడలు డాక్టర్ కవిత. రేణక్కకి కూతురెంతో కోడలూ అంతే, కోడలెంతో కూతురూ అంతే. అందుకే కూతురు, కోడలూ ఇద్దరూ కవితలే. నిజంగానే కవితలు. రేణక్కకి సరైన కోడలు. ఆ కుటుంబ వాతావరణాన్ని అర్థంచేసుకొని మసలు కొనే మనసున్న కోడలు డా॥ కవిత. రేణక్కకి ఓ బుజ్జి మనవడు చిన్నారి (భవిష్యత్తులో డాక్టర్ పట్టం ఇద్దాం) సంహిత్ స్టాలిన్ (తాత పేరు మళ్ళీ). ఇదీ రేణక్క కుటుంబం. వాళ్ళ భోజనాల గదిలో వున్నామంటే నలుగురు డాక్టర్లూ కొసరి కొసరి వడ్డిస్తుంటే వాళ్ళ ఆప్యాయతలకి కళ్ళు చెమరుస్తాయ్. అతిథి దేవోభవ. ఇలాంటి ప్రేమ, స్నేహం, ఆప్యాయతల ఇంటినుండొచ్చిన రేణక్క, డాక్టర్ రేణుకాదేవి.

కెవ్వుమన్న తల్లి కేక, క్యార్‌మన్న పిల్ల ఏడుపుతో సత్తెమ్మ బంధువులు ఆలోచనలు తెగి వర్తమానంలో కొచ్చారు. ఎదురుగా రేణక్క చేతుల్లో పండంటి పాప. సత్తెమ్మ కన్నవాళ్ళ ఆనందానికి అవధుల్లేవు. రేణక్క కళ్ళలో కాంతులీనే సంతోషం.

రాత్రి పన్నెండు దాటింది. ఆరోజు మే 2. రేణక్క జన్మదినం. "అమ్మా, హాప్పీ బర్త్‌డే" అంటూ చిన్నీ (డా॥ రామారావు), కోడలు కవిత, "హాప్పీ బర్త్‌డే నానమ్మా" అంటూ నానమ్మని అంటుకుపోయిన సంహిత్. ఈ సంతోషమంతా తన స్వంతమనుకొంటూ గర్వంగా గుబురు మీసాల చాటున చిర్నవ్వుతో డాక్టర్ స్టాలిన్.

సత్తెమ్మ బంధువులు ఇదంతా సంబరంగా చూస్తు న్నంతలో హైదరాబాద్ నుండి కూతురు కవిత అమ్మకి ఫోన్ "హాప్పీ బర్త్‌డే" అంటూ.

ఓ సంతోషకరమైన వాతావరణం. రేణక్క కళ్ళలో ఉద్వేగంతో కూడిన ఆనందబాష్పాలు.

"తమరి పుట్టిన రోజా తల్లీ. తమరు పచ్చగా పది కాలాల పాటు సల్లంగుండాలమ్మా. మా పిల్లది సాన అదృష్టం సేసుకొని మీ సేతుల మీదుగా, మీ పుట్టిన రోజున పుట్టిందమ్మా... దానికి మీ పేరే ఎట్టుకుంటా వమ్మా..." అంటూ కృతజ్ఞత నిండిన కళ్ళతో సత్తెమ్మ బంధువులు.

ఆనందంతో సజలాలైన రేణక్క కళ్ళు.

"తమరి పుట్టిన రోజా తల్లీ... తమరు పచ్చగా పది కాలాలపాటు సల్లంగుండాలమ్మా" అని కోరుకుంటున్న సత్తెమ్మ బంధువులు, ఇంకా ఎంతోమంది అభిమానులతో బాటు తూర్పు గోదావరి జిల్లా, రామచంద్రాపురం, తోటవారి వీధిలోవున్న రేణక్క నిండు నూరేళ్ళూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలనీ, ఆ కుటుంబం శాంతీ, సౌఖ్యాలతో అలరారాలనీ... నేనూ, మీరూ, మనందరం మనసారా కోరుకుందాం.

"హాప్పీ బర్త్‌డే టూ యూ రేణక్కా"

ప్రేమతో...

మంచిని ప్రేమించే మేమంతా... ■